మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 148 | బుధవారం | 19 - 11 - 2025 | పేజీలు: 8 | వెల: 4

### మావోయిస్టుల కదలికలతో భద్రతా దళాల గాలింపు చర్యలు బిగింపు



2లో..

## ఘనంగా బిర్సా ముండా విగ్రహావిష్కరణ





మనగళం, ప్రత్యేక ప్రతినిధి : పాడేరులో స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజనుల దైవం భగవాన్ శ్రీ బిర్సా ముండా విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాజి భగవాన్ శ్రీ బిర్సా ముండా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిర్సా ముండా త్యాగాలను ఒడిశా సీఎం గుర్తు చేశారు. అదేవిధంగా కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర మంత్రి సంధ్యా రాణి, సత్య కుమార్ యాదవ్, పీవీఎన్ మాధవ్ తదితరులు బిర్సా ముండా సేవలను కొనియడారు.

### గిరిజనుల అభివృద్ధికి...

## మోడీ పెద్దపీట



మనగళం, ప్రత్యేక ప్రతినిధి : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేశారని ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ పేర్కొన్నారు. పాడేరులో భగవాన్ శ్రీ బిర్సా ముండా 150వ జయంతి పురస్కరించుకొని ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. పీఎం నరేంద్ర మోడీ గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. 28 లక్షల పీజీటీ లకు విద్య, వైద్య సేవలు ఇస్తున్నామని, 90 వేల ఇళ్లకు మంచి నీరు అందిస్తున్నామని చెప్పారు. గిరిజనుల అస్తిత్వం కోసం బిర్సా ముండా ప్రయత్నం చేశారని, 1/70 చట్టం, పీసా చట్టాలు బిర్సా ముండా పోరాటంతోనే వచ్చాయని కొనియాడారు. ఆయన త్యాగాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని పిలుపునిచ్చారు.



### రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

మనగళం, కోడుమూరు : రైతులు తమ దృష్టికి తీసుకొని వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమవంతు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కేంద్ర ఉద్యాన మంత్రిత్వ శాఖ డిప్యూటీ కమిషనర్ డా.బీ.జే.బ్రహ్మ తెలిపారు. మంగళవారం కోడుమూరు మండలం ప్యాలకుర్తి, గోనెగండ్ల మండలంలోని గాజుల దిన్నె, గోనెగండ్ల గ్రామములో ఉల్లి పంటల సాగు, ఉత్పత్తి, విస్తీర్ణ అంశాలన కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర ఉద్యాన మంత్రిత్వ శాఖ డిప్యూటీ కమిషనర్ డా.బీ.జే.బ్రహ్మ రైతులతో మాట్లాడారు. ఉల్లి పంటను ఎప్పటినుండి సాగు చేస్తున్నారు? ఏ సీజన్ లో పండిస్తున్నారు? ఎలాంటి రకాలు పండిస్తున్నారు? ఎకరానికి ఎంత ఆదాయం వస్తుంది? మార్కెట్ లో ధర ఏ విధంగా ఉంది? అనే వివరాలను రైతులను అడిగి తెలుసు కున్నారు. అదే సాగులో ఎలాంటి

2 లో..

### బీహార్‌లో ఎన్డీఏ విజయంపై

## బీజేపీ శ్రేణుల సంబరాలు






మనగళం, ప్రత్యేక ప్రతినిధి : బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ ఘన విజయం సాధించడంపై బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. విశాఖపట్నం బీజేపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయెల్, భూపతిరాజు శ్రీనివాస్ వర్మతో కలిసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. కేక్ కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. బీహార్ ప్రజలు మరోసారి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంపై తమ సంపూర్ణ విశ్వాసాన్ని వ్యక్తం చేశారని ఈ సందర్భంగా వారు కొనియాడారు. కార్యకర్తల నినాదాలు మిన్నంటాయి.







### డ్రోన్ దాడులకు

## ఉగ్రకుట్ర భగ్నం

- ఎన్ఐఏ దర్యాప్తులో సంచలన నిజాలు వెల్లడి
- హమాస్ తరహా పన్నాగం
- సమన్వయ దర్యాప్తుతో ముందస్తు విజయం

మన గళం, న్యూఢిల్లీ : ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన కార్ బాంబు పేలుడు కేసు దర్యాప్తులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అత్యంత కీలకమైన విషయాలను వెలుగులోకి తెచ్చింది. దేశంపై ఇజ్రాయెల్‌పై పాలస్తీనాకు చెందిన హమాస్ తరహాలో డ్రోన్ దాడులు నిర్వహించడానికి ఉన్నత విద్యావంతులైన ఉగ్రవాదులు ఒక భయంకరమైన కుట్రను

2 లో..

### ప్రజల రక్షణే

## దేశ అత్యున్నత హక్కు

- ఉగ్రవాదం నుంచి ప్రజలను రక్షించుకునే హక్కు భారత్‌కు ఉంది: జైశంకర్
- తీవ్రవాదంపై రాజీలేని వైఖరి
- రష్యా విదేశాంగ మంత్రితో ద్వైపాక్షిక చర్చలు



మన గళం, న్యూఢిల్లీ : కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ రష్యాలో జరుగుతున్న షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) సమ్మిట్‌లో పాల్గొని, ఉగ్రవాదంపై భారత్ యొక్క దృఢమైన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. భారత ప్రజలను ఉగ్రవాద బెదిరింపుల నుంచి రక్షించుకునే హక్కు దేశానికి ఉందని ఆయన గట్టిగా తేల్చి చెప్పారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదన్న సందేశాన్ని అంతర్జాతీయ వేదికపై జైశంకర్ బలంగా వినిపించారు. ఈ సందర్భంగా ఆయన ఉగ్రవాదంపై పోరాటానికి ప్రపంచ దేశాల ఉమ్మడి సహకారం అవసరమని నొక్కి చెప్పారు, అలాగే ఉగ్రవాదంపై పోరాటం అనేది అన్ని దేశాలకు ఉమ్మడి ప్రాధాన్యతగా ఉండాలని సూచించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ యొక్క రాజీలేని వైఖరిని జైశంకర్ ఈ సదస్సులో

2 లో..

### షేక్ హసీనా మరణశిక్షపై

## శశిథరూర్ కీలక వ్యాఖ్యలు





- తీర్పుపై భారత్ ఆందోళన
- భారత్‌కు అప్పగించాలని విజ్ఞప్తి

మన గళం, న్యూఢిల్లీ : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆ దేశానికి చెందిన అంతర్జాతీయ నేర ట్రైబ్యునల్ మరణశిక్ష విధించడంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. హసీనాకు మరణశిక్ష విధించడం చాలా ఆందోళనకరమని ఆయన స్పష్టం చేశారు. ఒకవైపు వేరే దేశం యొక్క న్యాయవ్యవస్థ, అంతర్గత

2 లో..

# డ్రోన్ దాడులకు ఉగ్రకుట్ర భగ్నం

పన్నినట్లు ఎన్ఐఏ గుర్తించింది. ఈ నెట్‌వర్క్‌లో వైద్యులు, ఇంజనీర్లు వంటి సాంకేతిక నిపుణులు ఉన్నారని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ఎన్ఐఏ దర్యాప్తులో భాగంగా, కారు బాంబు పేల్చిన సూసైడ్ బాంబర్ డా. ఉమర్ ఉన్ నబీకి సహకరించినవారిపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా, 'వైట్ కోట్ టెర్రరిస్టు'కు సహకరించిన అమీర్ రషీద్ అలీని అరెస్టు చేసి, 10 రోజుల కస్టడీకి తీసుకున్నారు. ఆ తర్వాత, ఇదే ఉగ్ర మాడ్యుల్‌కు చెందిన మరో కీలక వ్యక్తి జాసిర్ బిలాల్ వాని అలియాస్ డానిష్‌ను శ్రీనగర్‌లో అరెస్టు చేశారు. ఈ మాడ్యుల్ మొత్తం వైట్ కోట్ టెర్రరిస్టులు, టెర్రర్ డాక్టర్లుగా వ్యవహరిస్తున్న ఉన్నత విద్యావంతులతో నిండినట్లు తేలింది.

– హమాస్ తరహా పన్నాగం

తాజాగా అరెస్టయిన డానిష్ ఇచ్చిన సమాచారంతోనే ఉగ్రవాదుల హమాస్ తరహా డ్రోన్ దాడుల కుట్ర బహిర్గతమైంది. ఎర్రకోట వద్ద జరిగిన పేలుడులో వాడిన అమ్మోనియం నైట్రేట్‌తో పాటు వంటి ప్రమాదకర పేలుడు పదార్థాలను పాశ్చాత్య దేశాల ఉగ్రవాద గ్రూపులు వినియోగిస్తున్నట్లు ఫోరెన్సిక్ నిపుణులు గుర్తించారు. ఇజ్రాయెల్‌పై హమాస్, హెజ్బుల్లా గ్రూపులు డ్రోన్లను ఉపయోగించి దాడులు చేసిన తరహాలోనే, భారత భద్రతా వ్యవస్థపై డ్రోన్ల ద్వారా భారీ విధ్వంసం సృష్టించడానికి ఈ ఉన్నత విద్యావంతులైన ఉగ్రవాదులు తమ మేధస్సును ఉపయోగిస్తున్నారని దర్యాప్తులో వెల్లడైంది. ఈ కుట్రలో డానిష్ వంటి సాంకేతిక నిపుణులతో పాటు డా. షాహీన్, డా. ముజమ్మిల్, డా. ఉమర్ వంటి వైద్య నిపుణులు కూడా భాగమయ్యారు.

– సమన్వయ దర్యాప్తుతో ముందస్తు విజయం

వాస్తవానికి, జమ్ము–కశ్మీర్ నౌగాం పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌తో మొదలైన దర్యాప్తులో, తొలుత డా. ఆదిల్, డా. ముజమ్మిల్ అరెస్టయ్యారు. జమ్మూ కశ్మీర్ పోలీసులు, హర్యానా పోలీసులతో కలిసి ఫరీదాబాద్‌లో ఏకంగా 2,900 కేజీల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. తెలుగు ఐపీఎస్ అధికారి డా. సందీప్ చక్రవర్తి చాకచక్యంతో, భద్రతా బలగాల అప్రమత్తతతో ఈ టెర్రర్ మాడ్యూల్‌ను ముందుగానే పసిగట్టగలిగారు. అయితే, అప్పటికే ఆలస్యం కావడంతో ఎర్రకోట కార్ బాంబ్ పేలుడు జరిగింది. కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్రం ఎన్ఐఏను రంగంలోకి దించింది. డానిష్‌ను శ్రీనగర్ నుంచి ఢిల్లీలోని ఎన్ఐఏ ప్రధాన కార్యాలయానికి తరలించి, మంగళవారం పాటియాలా హౌజ్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతడిని 10 రోజుల ఎన్ఐఏ కస్టడీకి అప్పగించింది. ఇప్పటికే కస్టడీలో ఉన్న అమీర్ రషీద్ అలీతో పాటు తాజాగా అరెస్టయిన డానిష్ ఇచ్చే సమాచారంతో ఈ ఉగ్ర కుట్రలను పూర్తిగా నిర్వీర్యం చేయడానికి దర్యాప్తు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

# ప్రజల రక్షణే దేశ అత్యున్నత హక్కు

పునరుద్ఘాటించారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించరాదని, ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే లేదా సమర్థించే ధోరణిని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని ఆయన తేల్చి చెప్పారు. ఉగ్రవాదం అనేది ప్రపంచ శాంతికి, భద్రతకు అత్యంత తీవ్రమైన ముప్పు అని, కాబట్టి దానిని ఎదుర్కోవడంలో ప్రపంచ దేశాలన్నీ ఏకమై, రాజీలేని పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ విషయంలో భారత్ తన దృఢ సంకల్పాన్ని అంతర్జాతీయ వేదికపై స్పష్టం చేసింది.

జైశంకర్ తన ప్రసంగంలో దేశ ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. భారత ప్రజలను ఉగ్రవాదం, హింసాత్మక దాడుల నుంచి రక్షించుకునే హక్కు, బాధ్యత సార్వభౌమ దేశంగా భారత్‌కు ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ రక్షణ హక్కు విషయంలో ఎటువంటి రాజీ ఉండదని, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారత్ వెనకడుగు వేయదని అంతర్జాతీయ సమాజానికి తేటతెల్లం చేశారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన పేలుడు వంటి సంఘటనల నేపథ్యంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. మూడు రోజుల పర్యటనలో భాగంగా రష్యాలో పర్యటిస్తున్న జైశంకర్, ఎస్సీవో సదస్సులో పాల్గొనడానికి ముందు రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లవ్రోవ్‌తో సమావేశమయ్యారు. ఈ కీలకమైన భేటీలో ఇరువురు నేతలు ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంపై చర్చించారు. రక్షణ, వాణిజ్యం, ఇంధన రంగాల్లో సహకారంపై సమీక్ష జరిపి, ప్రాంతీయ పరిస్థితులు, అంతర్జాతీయ అంశాలపై కూడా అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ చర్చలు ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి దోహదం ̌డతాయని అధికారులు తెలిపారు. ఎస్సీవో అనేది ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఉద్దేశించిన ప్రాంతీయ భద్రతా కూటమి. ఇటువంటి ముఖ్యమైన వేదికపై కేంద్ర మంత్రి జైశంకర్ ఉగ్రవాదంపై గట్టిగా మాట్లాడటం, ప్రజల రక్షణ హక్కును బలంగా నొక్కి చెప్పడం అనేది ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే శక్తులకు పరోక్షంగా హెచ్చరిక పంపినట్లు అయింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాల్సిన ఆవశ్యకతను ఆయన ఈ వేదికగా ప్రపంచ దేశాలకు గుర్తు చేశారు. ఉమ్మడి సహకారంతోనే ఉగ్రవాద సమస్యను పూర్తిగా నిర్మూలించగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# మావోయిస్టుల కదలికలతో భద్రతా దళాల గాలింపు చర్యలు బిగింపు





- బహుళ జిల్లాల్లో సెర్చ్ ఆపరేషన్ - ఎన్‌కౌంటర్‌లో హిడ్మా సహా ఆరుగురి మృతి - ఏలూరు సహా పలు చోట్ల 46 మంది అరెస్టు

మన గళం, అమరావతి : ఏపీ అంతటా మావోయిస్టుల కదలికలు పెరగడంతో భద్రతా వ్యవస్థ అలర్ట్ మోడ్‌లోకి వెళ్లింది. అడవి ప్రాంతాల నుంచి రాష్ట్రంలోకి చొరబడిన మావోయిస్టుల కోసం పోలీసులు, గ్రేహౌండ్స్ దళాలు భారీ స్థాయిలో గాలింపు చర్యలు చేపట్టాయి. ఇప్పటికే విజయవాడలో 31 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్న తర్వాత, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అల్లూరి జిల్లాల్లో విస్తృతంగా సెర్చింగ్ కొనసాగుతోంది. ఈ క్రమంలో ఏలూరులో మాత్రమే 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అల్లూరి జిల్లాలో ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌పై ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర కీలక వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పరిణామాల తర్వాత మావోయిస్టులు మళ్లీ ఏపీ వైపు కదులుతున్నట్లు సమగ్ర సమాచారం అందిందని తెలిపారు. రెండు రోజుల క్రితమే మావోయిస్టుల కదలికలపై పక్కా ఇన్‌పుట్ వచ్చిన నేపథ్యంలో, భద్రతా బలగాలు అప్రమత్తంగా ఉండి గాలింపు చేపట్టాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఉదయం 6.30 నుంచి 7 గంటల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో అగ్రనేత హిడ్మా, ఆయన సతీమణి సహా ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. అరెస్టయిన వారిలో 9 మంది మావోయిస్టులు కేంద్ర కమిటీ సభ్యుడు దేవ్‌జీ అనుచరులని, మిగతావారు సౌత్ బస్తర్ జోనల్ కమిటీకి చెందినవారని ఇంటెలిజెన్స్ అధికారులు వెల్లడించారు. మావోయిస్టు కార్యకలాపాలను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా నిఘా మరింత బలపరచినట్లు పోలీసులు తెలిపారు. ఏపీ సరిహద్దుల్లో భద్రతా చర్యలు పెంచడంతో, అడవి ప్రాంతాలలో సుదీర్ఘంగా గాలింపు ఆపరేషన్లు కొనసాగనున్నాయని అధికారులు స్పష్టం చేశారు.

# మానవత్వం చాటి చూపిన ఆర్టీసీ డ్రైవర్

మన గళం, హైదరాబాద్ : విధి నిర్వర్తనలోనే కాదు, మానవత్వంలోనూ ఆదర్శంగా నిలిచే ఆర్టీసీ సిబ్బందిలో మరో ఉదాహరణ వెలుగులోకి వచ్చింది. సూర్యాపేట బస్టాండ్ వద్ద తన చిన్నారితో ప్రయాణిస్తున్న మహిళ వ్యక్తిగత అవసరాల కోసం బస్సు దిగగా, ఆ శిశువును చూసేందుకు ఎవరూ లేకపోయారు. ఈ పరిస్థితిని గమనించిన మనుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్, ఆ చిన్నారిని ప్రేమగా చూసుకుంటూ, జాగ్రత్తగా దగ్గర పెట్టుకుని తన మానవీయతను చాటుకున్నారు. శిశువును సురక్షితంగా కాపాడుతూ, తల్లి తిరిగి వచ్చే వరకు దాని పట్ల ఆప్యాయత చూపిన ఈ డ్రైవర్ వ్యవహారం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. తిరిగి వచ్చిన తల్లికి ఆ చిన్నారిని సంపూర్ణంగా సురక్షితంగా అప్పగించిన ఈ సంఘటన ప్రజలను అట్టడుగునుంచి హత్తుకుంటోంది. ఈ సంఘటనపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఆ డ్రైవర్ సేవా భావాన్ని హృదయపూర్వకంగా అభినందించారు. "ఆర్టీసీ అంటే కేవలం ప్రయాణ సేవ మాత్రమే కాదు%ో% మనసున్న మనుషుల తోటి సురక్షిత ప్రయాణం కూడా" అని ఆయన అన్నారు. డ్రైవర్ చేసిన ఈ మానవీయ చేష్ట ఆర్టీసీ ప్రతిష్ఠకు మరింత మెరుగులు దిద్దిందని ప్రశంసించారు. ప్రజలు, ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది అందరూ ఈ ఘటనను హృదయపూర్వకంగా స్మరిస్తూ, ఇటువంటి మానవీయ సేవలు సమాజంలో ఇంకా ఉన్నాయని గర్వంగా పేర్కొంటున్నారు.

# షేక్ హసీనా మరణశిక్షపై శశిథరూర్ కీలక వ్యాఖ్యలు

విషయాలపై తాను వ్యాఖ్యానించడం సరైనది కాదని పేర్కొన్నప్పటికీ, తాజా తీర్పు మాత్రం అంతర్జాతీయ సమాజంలో ఆందోళన కలిగించే అంశమని థరూర్ తన అభిప్రాయాన్ని తెలియజేశారు. ఈ కేసుల వెనుక రాజకీయ ప్రేరేపిత అంశాలు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో, ఈ తీర్పు ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. మరణశిక్ష విధించడం సరైందని తాను భావించడం లేదన్న థరూర్, ఏ కేసులో అయినా ప్రతి ఒక్కరికీ తమను తాము సమర్థించుకుంటూ వాదించుకునే అవకాశం తప్పనిసరిగా ఉండాలని, ఆ తర్వాతే ఇలాంటి కఠినమైన శిక్షలు విధించాలనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. గత ఏడాది బంగ్లాదేశ్‌లో చోటు చేసుకున్న దేశవ్యాప్త తిరుగుబాటు నేపథ్యంలో హసీనా తన పదవికి రాజీనామా చేసి భారత్‌కు వచ్చారు. స్వాతంత్ర్య పోరాట వీరుల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలలో కోటా ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ప్రారంభమైన విద్యార్థి నిరసనలు, చివరకు మహమ్మద్ యూనస్ నేతృత్వంలో మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటుకు దారితీశాయి.

హసీనా అధికారంలో ఉన్నప్పుడు స్వదేశంలో జరిగిన ఆందోళనలను అణిచివేసేందుకు అమానవీయంగా వ్యవహరించారనే ఆరోపణల మేరకు ఆమెపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ అనంతరమే ఐసీటీ తాజాగా తీర్పు వెలువరించింది. ఈ ట్రైబ్యునల్ హసీనాను దోషిగా తేల్చి మరణశిక్ష విధించడం గమనార్హం. దీనితో, ప్రస్తుతం భారత్‌లో ఉన్న హసీనాను తమకు అప్పగించాలంటూ మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం భారత్‌కు అధికారికంగా విజ్ఞప్తి చేసింది. కాగా, హసీనాపై నమోదు చేసిన కేసులు మరియు తాజా తీర్పు పక్షపాతంతో కూడినవి, పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవి అని ఆమె పక్షం వారు మొదటి నుంచీ వాదిస్తున్నారు. ఈ మొత్తం పరిణామం బంగ్లాదేశ్ రాజకీయాలలో ఒక కీలక మలుపుగా పరిగణించబడుతోంది. హసీనా అనుచరులు, అభిమానులు ఈ తీర్పుపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. భారత్‌లో శరణార్థిగా ఉన్న మాజీ ప్రధానిని తిరిగి అప్పగించాలనే యూనస్ ప్రభుత్వ విజ్ఞప్తిపై భారత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ప్రస్తుతం ఉత్కంఠగా మారింది. మొత్తం మీద, బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య ప్రక్రియ, న్యాయవ్యవస్థ యొక్క విశ్వసనీయతపై అంతర్జాతీయంగా అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో, శశిథరూర్ చేసిన వ్యాఖ్యలు ఈ వ్యవహారంలో భారతదేశం యొక్క సున్నితమైన వైఖరిని సూచిస్తున్నాయి. ఈ రాజకీయ, న్యాయపరమైన సంక్షోభం భారత–బంగ్లాదేశ్ ద్వైపాక్షిక సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది తదుపరి చర్చనీయాంశంగా ఉంది. భారత్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయం బంగ్లాదేశ్ యొక్క అంతర్గత రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేసే అవకాశం ఉంది.

# రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

సమస్యలు ఎదుర్కొంటున్నారు? ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయ సహకారాలు కావాలని రైతులను ఆరా తీశారు? పంట వేసే సమయానికి ప్రభుత్వం నుండి నాణ్యతతో కూడిన విత్తనాలు ఇప్పించాలని, పండించిన పంటకు కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రైతులు కేంద్ర సభ్యుల దృష్టికి తీసుకొని రాగా సంబంధిత సమస్యలు నోట్ చేసుకొని వాటిని పరిష్కరించే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తామని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర సభ్యులు మనోజ్ , రాజీవ్ కుమార్, హేమంగా భార్గవ్, శరవణన్, రాష్ట్ర ఉద్యాన శాఖ అధికారి కార్యాలయం నుండి ఉప సంచాలకులు జమదగ్ని, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణ రెడ్డి, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

# నా భార్య, నా అత్త వల్లే ఈరోజు నేను ఇలా అయ్యా

మన గళం, హైదరాబాద్ : ప్రముఖ పైరసీ వెబ్‌సైట్ 'ఐ బొమ్మ' కేసులో అరెస్ట్ అయిన రవి పోలీసుల విచారణలో సంచలన వ్యాఖ్యలు చేశాడు. తనను ఈ దారిలోకి నెట్టింది కుటుంబంలోని అవహేళనలు, భార్య–అత్త ఒత్తిడేనని కంటతడి పెట్టి చెప్పినట్టు సమాచారం. బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్స్ ద్వారా భారీగా సంపాదించిన డబ్బు కూడా తన కుటుంబం నమ్మలేదని, దీనివల్లనే తన జీవితం నేర దారిలోకి మళ్లిపోయిందని రవి వెల్లడించాడు. పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం, విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో సాధారణ డిగ్రీ పూర్తి చేసిన రవి, వెబ్‌డిజైనర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించాడు. తల్లిదండ్రులు విడిపోయిన తరువాత కుటుంబ బాధ్యతలన్నీ తన భుజాలపై పడ్డాయని, తన చెల్లిని గత ఏడాదే పెళ్లి చేసిన విషయాన్ని గుర్తుచేశాడు. ప్రేమించి పెళ్లి చేసుకోవడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందని, కానీ అదే పెళ్లే తన జీవితంలో ఒత్తిడికి కారణమైందని వాపోయాడు. సంభవించిన ప్రతి సమస్యలో భార్య, అత్త సమాజం మాటల్ని నమ్మి తనను అవమానించారని, తక్కువ జీతం కారణంగా కుటుంబ అవసరాలు తీర్చలేక పోతే మరింతగా అవహేళనలు ఎదుర్కొన్నట్టు తెలిపాడు. "నేను ఇచ్చే డబ్బు సరిపోదు%ో% నేనుండకపోతే బెటర్" అనే మాటలే తనను మానసికంగా ఛిన్నాభిన్నం చేశాయని రవి చెప్పినట్టు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో 2021 కరోనా రెండో తరంగ సమయంలో తన వెబ్‌డిజైన్ నైపుణ్యంతో ఐ బొమ్మ వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్టు రవి ఒప్పుకున్నాడు. అప్పట్లో విడుదలైన సినిమాల అసలు ప్రింట్లను అప్‌లోడ్ చేయడం వల్ల వెబ్‌సైట్ ఒక్కసారిగా పాపులర్ అయ్యిందని, రోజురోజుకూ ట్రాఫిక్ పెరిగి తనకు భారీ ఆదాయం వచ్చిందని వివరించాడు. బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్స్ ప్రకటనల ద్వారా వచ్చిన మొదటి సంపాదన ?75 లక్షలు అని చెప్పాడు. అయితే ఈ సంపాదనను కూడా భార్య–అత్త నమ్మలేదని, తనను వదిలించుకోవాలని వారి మనసులో ముందే నిర్ణయం తీసుకున్నట్టు అనిపించిందని పేర్కొన్నాడు. "ఇవరూ నన్ను ఒప్పుకోనప్పుడు, డబ్బు తప్ప ఇంకేదీ నన్ను కాపాడదని అప్పుడు అర్థమైంది" అని పోలీసులకు తెలిపినట్టు తెలుస్తోంది. "ఈరోజు మీకు దొరికిపోవడానికి కూడా కారణం వాళ్లే" అనే రవి వ్యాఖ్యలు విచారణలో కలకలం రేపాయి.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## సూర్య నారాయణ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు శ్రీ సూర్య నారాయణ స్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరీ శంకర స్వామివారికి ప్రాతః కాలం నుండి లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం, విశేష అర్చనలు గావించారు. సాయంకాలం త్రయోదశి సందర్భంగా స్వామి వారికి విశేష రుద్రాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ నాగరాజు



మనగళం, కర్నూలు సిటీ : వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీపై న్యూ ఢిల్లీలో నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. స్టాండింగ్ కమిటీ చైర్మన్ కనిమొళి కరుణానిది అధ్యక్షత సాగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యుడిగా ఉన్న ఎంపీ హాజరయ్యారు. సమావేశంలో భాగంగా పిల్లల ఉత్పత్తులు ఇతర ఆహార పదార్థలలో చెక్కర కంటెంట్ పై వినియోగదారుల వ్యవహారాల శాఖ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ అధికారులతో కమిటీ చర్చించింది.

# పంటల సాగుపై అవగాహన కల్పించండి


– కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి





మనగళం, కర్నూలు సిటీ : పంటల సాగుపై రైతులకు రైతుసేవా కేంద్రాల ద్వారా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి రైతులకు సూచించారు. ఆదోని మండలం మదిరె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మిరప పంట సాగు, ఎన్డిబిఎల్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్, దాదా పీర్ మిల్ యూనిట్ లలో పత్తి కొనుగోలు ప్రక్రియను, అన్న క్యాంటీన్ లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ముందుగా మిరప పొలాలను పరిశీలించిన కలెక్టర్ రైతులతో మాట్లాడారు. సమస్యలు, పంట పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు. మిరప పంట సాగుకు ఎకరాకు ఎంత పెట్టుబడి వస్తుంది? విత్తనాలు ఎక్కడ నుండి కొనుగోలు చేస్తున్నారు? తదితర విషయాలపై ఆరా తీశారు. 60 శాతం పైగా మిరప పంటకు కాయ కుళ్ళు, కాయ మచ్చ వచ్చిందని రైతులు కలెక్టర్ కి చూపించారు. వ్యవసాయ అధికారులు రైతు సోదరులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, సమయానుకూలమైన సూచనలు, సాంకేతిక మార్గదర్శకాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. పత్తి రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పత్తికి మంచి ధర వచ్చేందుకు వీలుగా రైతులు పత్తిని బాగా ఆరబెట్టుకొని తేమ శాతం లేకుండా తీసుకొని వచ్చే విధంగా చూసుకోవాలని కలెక్టర్ రైతులకు సూచించారు. తేమ శాతం 14 ఉన్నా కూడా రైతుల నుండి పత్తిని కొనుగోలు చేసే విధంగా చూడాలని కలెక్టర్ సిసిఐ అధికారులకు సూచించారు. రుచి, శుచి తో భోజనాన్ని అందించాలి: అన్న క్యాంటీన్ ద్వారా రుచి, శుచి తో భోజనాన్ని ప్రజలకు అందించాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. అక్కడే భోజనం చేస్తున్న యువకులు, మహిళలతో కలెక్టర్ మాట్లాడారు. భోజనం రుచిగా ఉందా? సరిపోయేంత పెడుతున్నారా? ప్రతి రోజు ఇక్కడే భోజనం చేస్తారా? భోజన పరంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా? అన్న క్యాంటీన్ లోపల శుభ్రంగా ఉంచుతున్నారా? అని కలెక్టర్ ఆరా తీశారు? భోజనం రుచిగా పెడుతున్నారని మహిళలు కలెక్టర్ కు తెలిపారు. కార్యక్రమంలో ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ అజయ్, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, మార్కెటింగ్ ఏడి నారాయణ మూర్తి, ఆదోని తహసీల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ హాస్టళ్లలో వసతులు మెరుగుపరచండి



మనగళం, కర్నూలు సిటీ : బీసీ సంక్షేమ శాఖ హాస్టల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, వసతులు మెరుగు పరచాలని బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ బాబు, రాయలసీమ విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ కోడి వెంకటేశ్వర్లు, ప్రోగ్రెసివ్ యూత్ అసోసియేషన్ నాయకుడు కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా సంక్షేమ శాఖ అధికారి ప్రసూనకు వారు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ చలికాలం ప్రారంభం కావడంతో విద్యార్థులకు నాణ్యమైన బెడ్ షీట్లు పంపిణీ చేయాలని, మెనూలో నాణ్యత పాటించాలని, విద్యార్థుల భద్రత దృష్ట్యా సంక్షేమ హాస్టల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోండి

– కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



మనగళం, కర్నూలు సిటీ : వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందుగానే సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశించారు. ఆదోని మండలం 104 బసాపురం గ్రామంలోని సమ్మర్ స్టోరేజ్ (ఎస్.ఎస్.) ట్యాంక్‌లో జరుగుతున్న మరమ్మతు పనులను కలెక్టర్ పరిశీలించారు. నీటి నిల్వ సామర్థ్యాన్ని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఎస్. ట్యాంక్‌కు సంబంధించిన అన్ని మరమ్మతు పనులను నవంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే డిసెంబర్ చివరి నాటికి ట్యాంక్ పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం బసాపురం ఎస్.ఎస్. ట్యాంక్ 3,110 మిలియన్ లీటర్ల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం కలిగి ఉన్నప్పటికీ, ప్రస్తుతం కేవలం 20 శాతం మాత్రమే నీరు ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రాబోయే వేసవిలో గ్రామ ప్రజలకు త్రాగునీటి కొరత రాకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఇంచార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, తహసీల్దార్ రమేష్, మున్సిపల్ కమిషనర్ కమిషనర్ నాసిర్ ఉసేన్, మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్లు వెంకట చలపతి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్




మనగళం, కర్నూలు సిటీ : ఉమ్మడి జిల్లాల పోలీస్ అధికారులతో స్థానిక జిల్లా కోర్టు లోని న్యాయ సేవ సదన్ లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జి.కబర్ధి, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. డిసెంబర్ 13 న జరుగబోయే జాతీయ లోక్ అదాలత్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో కోర్టులలో పెండింగ్ ఉన్న రాజీ కాదగిన కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎక్కువ క్రిమినల్ కేసులు పరిష్కరించేల ప్రత్యేక దృష్టి సారించి ఈ లోక్ అదాలత్ ను విజయవంతం అయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ అవకాశమును కక్షిదారులు వినియోగించుకోని వారి కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించు కోవాలని కోరారు. కోర్టు మానిటరింగ్ పోలీసు లను కోర్టులలో ఉన్న కేసులను మానిటరింగ్ చేసుకొని ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో పోక్సోకోర్టు అదనపు జిల్లా జడ్జి రాజేంద్ర బాబు, మెజిస్ట్రేట్లు అనిల్ కుమార్, అపర్ణ, అనూష, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఆర్లగడ్డ డీఎస్పీప్రమోద్ కుమార్, కర్నూలు దిశ సీఐ రామా నాయుడు, ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్, కర్నూలు, నంద్యాల జిల్లా సి ఐ లు, యస్ ఐ లు, పోలీసు అధికారులు, పాల్గొన్నారు.

## మాదకద్రవ్య రహిత సమాజంగా మారుద్దాం

– నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : మాదక ద్రవ్యాల రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం భాగంగా కొండారెడ్డి బురుజు వద్ద ఉద్యోగులు, సిబ్బందితో మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కేంద్ర సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్ గొప్ప ప్రాజెక్టు అని తెలిపారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించడం, వ్యసనగ్రస్తులను గుర్తించి వారిని దాని నుండి విముక్తులను చేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి దేశాన్ని ప్రగతి వైపు నడిపించాలని సూచించారు. మాదక ద్రవ్యాల దుష్పరిణామాలు, అక్రమ రవాణాను నిరోధించడం ప్రతి పౌరుడి బాధ్యతగా పేర్కొన్నారు. ఉద్యోగులు సైతం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు తెలియజేసి ఆరోగ్య భారత్ కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ యన్.చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఆర్ఓ జునైద్, కార్యదర్శి నాగరాజు, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

## చోరీకి పాల్పడిన నిందితుడు అరెస్టు

– 9 తులాల బంగారు ఆభరణాలు, 55 తులాల వెండి, రూ. లక్ష నగదు స్వాధీనం






మనగళం, కర్నూలు క్రైం : సి. బెళగల్ పోలీసుస్టేషన్ పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామంలో సెప్టెంబర్ 25 న దొంగతనం జరిగిన విషయం తెలిసిందే. తెలుగు చిన్న రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ పర్యవేక్షణలో కోడుమూరు సర్కిల్ ఇన్ స్పెక్టర్ తబ్రేజ్, సి . బెళగల్ పోలీస్ స్టేషన్ ఎస్సై వేణు గోపాల్ రాజు ఆధ్వర్యంలో, ఎఎస్సైలు నాగయ్య, హెడ్ కానిస్టేబుల్ తిమ్మప్ప, కానిస్టేబుల్ లు మల్లికార్జున, సుధాకర్, భాస్కర్, సుధర్శన్, సత్యరాజు బృందంగా దర్యాప్తు చేపట్టారు. వివరాలను ముద్దాయి గిర్నీ వెంకటేష్ సి.బెళగల్ గ్రామం నుండి చింతామానుపల్లి పోవు దారిలో ఉన్న గుట్టల నాగమ్మ గుడి వద్ద సి.బెళగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. కర్నూల్ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ బాబు ప్రసాద్ వివరాలు తెలిపారు. పాతనేరస్తులను విచారణ చేయడం, సీసీ కెమెరాల పుటేజీలను వర్క్ ఔట్ చేయడంతో ఈ నిందితుడి గుర్తించి పట్టుకున్నామన్నారు. క్రైమ్ నెం. 155/2025 పై దర్యాప్తు ను కొనసాగించగా నేరాలకు పాల్పడిన నిందితుడు గా ఉన్న తిమ్మం దొడ్డి గ్రామానికి చెందిన గిర్నీ వెంకటేష్ (45) ను అరెస్టు చేశామన్నారు. నిందితుడి నుంచి తులాల బంగారు ఆభరణాలు , సుమారు 55 తులాల వెండి , లక్ష రూపాయల నగదు స్వాధీనపరచుకున్నామని చెప్పారు. ప్రెస్ మీట్ లో కోడుమూరు సిఐ తబ్రేజ్, సి. బెళగల్ ఎస్సై వేణుగోపాల్ రాజు , సిబ్బంది ఉన్నారు.

# రైతులకు పాస్ పుస్తకాలు అందించేది ఎప్పుడు...

- రెవెన్యూ కార్యాలయంలో నిలిచి ఉన్న పాస్ పుస్తకాలు...
- కూటమి ప్రభుత్వం ఎప్పుడు రైతుల పాస్ పుస్తకాలు మంజూరు చేయమంటే అప్పుడు మంజూరు చేస్తాం తాసిల్దార్ శ్రీనివాసులు...






నందవరం నవంబర్ 18 మనగలం న్యూస్ : నందవరం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో రే సర్వే జరిగిన తర్వాత రాష్ట్రంలోని రైతులకు ఎలాంటి పొరపాట్లు లేకుండా సరికొత్తగా 21 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. పాస్ పుస్తకాల పంపిణీకి ముందు మరోసారి క్షుణ్ణంగా పాస్ పుస్తకాలు రాజ్యముద్రలతో మంజూరు చేయటం జరిగిందని తెలియజేశారు. గత వైసీపీ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాసుపుస్తకం పై ఫోటోను తొలగించి రాజ్యముద్రతో పాస్ పుస్తకాలు మంజూరు చేయటం రైతులకు సంతోషకరమని రైతులు మాట్లాడటం జరుగుతుంది చేసిన తప్పులను సరి చేసినా కూడా. రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో మాచాపురం ఇబ్రహీంపురం నదికేరవాడి చిన్నకొత్తిలి పెద్దకొత్తిలి గంగవరం పొరకాలదీన్ని ముగతి సోమలగూడూర్ గురజాల రాయచోటి మిట్టసోమవరం గ్రామాలలో రి సర్వే ముగించినా కూడా నెలలు తరబడిన రైతుల పాస్ పుస్తకాల అందించడం లేదని రైతులు ఆ నోట ఈ నోట గుసగుసలు వినబడుతున్నాయి అధికారులు ఇప్పటికైనా దీనిని దృష్టిలో ఉంచుకొని రిసర్వే జరిగిన గ్రామాలు రైతులకు పాసుపుస్తకాలు మంజూరు చేసింటే బాగుంటుందని అనుకుంటున్నారు. శ్రీనివాసులు మాట్లాడుతూ రి సర్వే జరిగిన గ్రామాలు రీ సర్వే ఏదైతే జరిగింటాదో ఆ గ్రామంలో ఉండే పాసుపుస్తకాలు మొత్తం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఫోటోను తొలగించి చంద్రబాబు నాయుడు రాజ్యముద్రతో రైతు పుస్తకాలు అందించడం జరిగింది కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు ముఖ్యమంత్రి పాస్ పుస్తకాలు అందించండి ప్రోగ్రాం పెట్టి తెలియజేస్తే మేము వెంటనే రైతులకు పాస్ పుస్తకాలు అందజేస్తామని తెలియజేశారు.

## బ్రహ్మగిరి ఘాట్ రోడ్ లో పొంచి ఉన్న ప్రమాదం చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు.....



మనగలం బ్రహ్మగిరి :-ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం పుణ్యక్షేత్రానికి నిత్యం బ్రహ్మ గిరి గ్రామం గుండా మన రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా వేలాది మంది భక్తులు నిత్యం ప్రత్యేక వాహనాల్లో ప్రయాణం చేస్తుంటారు బ్రహ్మగిరి గ్రామం మలుపుల వద్ద ఈపుగా పిచ్చి చెట్లు ఉండడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనబడడం లేదు ముందే ఘాట్ రోడ్డు ప్రయాణం ఎదురుగా వచ్చే వాహనం కనపడకపోవడం వల్ల ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు ఇదే రహదారి గుండా చాలామంది అధికారులు ప్రయాణం చేస్తుంటారు అయినప్పటికీ సంబంధిత అధికారులు రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించకపోవడం గమనర్హం

# ఆసుపత్రిలో అన్ని సేవలు అందుబాటులోకి తెస్తున్నాం

- అభివృద్ధికి 3 కోట్లు నిధులు విడుదలయ్యాయి -ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు






మనగలం, పత్తికొండ: పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల సేవలు అందుబాటులోకి తెస్తున్నామని ఎమ్మెల్యే కే.ఈ శ్యాంబాబు అన్నారు. ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎక్స్ రే విభాగాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఆసుపత్రికి చిన్నప్పటి సమస్య వచ్చిన కర్నూలుకు రిఫర్ చేసే పరిస్థితిలు ఉండేవన్నారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన ఏడాదిన్నరలో ఆసుపత్రిలో వాటర్ ప్లాంట్ ఆపరేషన్ థియేటర్ ఈరోజు ఎక్రే విభాగం ఏర్పాటు చేశామన్నారు. ఇకపై రోగులు ఎంతటి క్లిష్టమైన సమస్యతో వచ్చిన ఇక్కడే చికిత్సలు అందిస్తారు అన్నారు. ఆస్పత్రి ఆధునికరణకు రూ 3 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని త్వరలో ఆ పనులు కూడా చేపడతామన్నారు. అయితే ప్రస్తుతం వైద్యుల కొరత ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని త్వరలోనే ఆ సమస్య పరిష్కరిస్తామన్నారు. పేదలకు ప్రభుత్వం అందించే ఉచిత వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందాలన్నదే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఆయనతోపాటు ఆసుపత్రి కమిటీ సభ్యులు సాంబశివరెడ్డి, సురేష్ కుమార్ ,బత్తినిలోకనాథ్, ఆస్పత్రి ఇంచార్జ్ డాక్టర్ కల్పన, డాక్టర్ హారిక, మణిదీప్, టిడిపి నాయకులు తదితరులు ఉన్నారు.

## కర్నూలు మండలం బి తాండ్రపాడు గ్రామం కోటి సంతకాల సేకరణ



మన గళం కర్నూలు: కోడుమూరు నియోజకవర్గం కోటి సంతకాల సేకరణమాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి తలపెట్టిన కోటి సంతకాల సేకరణప్రభుత్వ మెడికల్ కాలేజీల వైద్య విద్యను ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వంతక్షణం వెనక్కు తీసుకోవాలని కోడుమూరు నియోజకవర్గం వైయస్సార్సీపీ సమన్వయకర్త, కుడా మాజీ చైర్మన్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు సభ్యులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి మరియు కోడుమూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇంచార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఆదేశాల మేరకు కర్నూలు మండలం బి తాండ్రపాడు గ్రామం కోటి సంతకాల సేకరణ పూర్తయినవి పూర్తయిన వాటిని కోట్ల హర్షవర్ధన్ రెడ్డి డాక్టర్ ఆదిమూలపు సతీష్ అప్పగించడం జరిగినది. కోడుమూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బొజ్జన్న, బైరాపురం కృష్ణ, కేశవరెడ్డి, మల్లికార్జున, ప్రభుదాస్, రమేష్, భాస్కర్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# డోన్ రాజా టాకీస్ సమీపంలో జంట హత్య కల కలం





మన గళండోన్ పట్టణంలోని రాజా టాకీస్ వెనుక వీధిలో నివాసం ఉండే అశ్విని అనే మహిళ మరియు ఇంట్లో పాతపేట లో నివాసముంటున్న రౌడీ షీటర్ ఫరీద్ అనే వ్యక్తి ఇద్దరు కలిసి పెట్రోల్ పోసుకొని అనుమానాస్పద స్థితిలో ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటనపై హత్యనా? ఆత్మహత్యనా? లేక అక్రమ సంబంధమా? అనే కోణంలో సీఐ ఇంతియాజ్ భాష, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి ఫొరెన్సిక్ టీం సిబ్బంది తో కలిసి విచారణ చేస్తున్నారు. అశ్విని అనే మహిళకు ఇద్దరు సంతానం భర్త ఉన్నారు. భర్త పిల్లలు లేని సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. నిన్న సాయంత్రం 6 గంటల సమయంలో పర్వీద్ అశ్విని అనే మహిళతో సహజీవనం చెసుకున్నారని అనుమానంతో దీనిపైన కూడా పోలీసులు మరియు కర్నూల్ నుంచి వచ్చిన ఫొరెన్సిక్ బృందాలు విచారణ చేపట్టారు. విచారణ అనంతరం మృతదేహాలను ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఫోరెన్సిక్ ల్యాబ్ ఆధారంగా నిజానిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## నాణ్యత లేకపోతే చర్యలు తప్పవు



మనగళం, ఆస్పరి : నాణ్యమైన ఆహారం, నైపుణ్యవంతమైన బోధన లేకపోతే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా. ఎ.సిరి హెచ్చరించారు. కర్నూలు జిల్లా ఆస్పరి కేజీబీవీ పాఠశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి సందర్శించారు. పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, తరగతి గదులు, వంటశాల తనిఖీ చేశారు. ఆహారం నాణ్యత, మెనూ ప్రకారం ఏ ఏ ఆహార పదార్థాలు వండుతున్నరనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి గదిలోకి వెళ్ళిన జిల్లా కలెక్టర్ గణితంలో ప్రశ్నలను అడిగి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. 40 శాతం మంది విద్యార్థులు మాత్రమే సమాధానాలు చెప్పడంతో అందరికీ ఎఫ్ ఎల్ ఎన్ ట్రైనింగ్ ఇవ్వాలని, ప్రాథమిక అవగాహన ప్రతి సబ్జెక్టులను కలిగించాలని సూచించారు. కేజీబీవీ పాఠశాలలో శుభ్రతపై ఆరా తీశారు. పాఠశాల విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు స్వయంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ పాఠశాల డార్మెటరీ నాణ్యత పై సంబంధిత డీఈ ను అడిగి అన్ని తరగతి గదులు భవనాలు పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ శామ్యూల్ పాల్, మండల విద్యాధికారి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయండి

- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలోని కిడ్స్ వరల్డ్ నుండి బుధవారపేట బ్రిడ్జి వరకు రహదారి విస్తరణ పనులు మరింత వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం, ఆర్అండ్ బీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రహదారి విస్తరణలో ప్రభావితమవుతున్న 180 ఆస్తుల్లో ఇప్పటివరకు 50 మంది యాజమానులు ముందుకొచ్చి అవసరమైన పత్రాలు సమర్పించారని తెలిపారు. మిగిలిన యాజమానులు త్వరగా సహకరిస్తే విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. ప్రభావితులకు టిడిఆర్ బాండ్ల జారీ, భవన నష్టపరిహారం అందజేతను త్వరితగతిన పూర్తి చేస్తామని కమిషనర్ చెప్పారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఎంఈ సునీల్, డీఈ ఫనిరాం, డీసీపీ వెంకటరమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# క్లౌడ్‌ఫ్లేర్ సర్వర్ డౌన్..

న్యూఢిల్లీ,నవంబర్ 18: మనగలం: ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (ట్విట్టర్) మళ్లీ మొరాయిస్తున్నది. సాయంత్రం 5గంటల భారత్‌లో ‘ఎక్స్’ పని చేయడం లేదు. డిజిటల్ ప్లాట్‌ఫాట్స్ ట్రాకర్ వెబ్‌సైట్ అయిన డౌన్‌డెటెక్టర్‌లో వేలాది మంది వినియోగదారులు ఫిర్యాదు చేశారు. తమ అకౌంట్స్‌ని యాక్సెస్ చేయలేకపోతున్నామంటూ రిపోర్ట్ చేశారు. ‘ఎక్స్’ యాప్‌తో పాటు వెబ్‌సైట్‌లో లాగిన్ చేయలేకపోతున్నామని పేర్కొన్నారు. పలువురు ఇంటర్నల్ సర్వర్ ఎర్రర్ సందేశం వస్తున్నట్లుగా తెలిపారు. భారత్‌తో పాటు అమెరికాలోనూ ‘ఎక్స్’ని యాక్సెస్ చేయలేకపోతున్నామంటూ యూజర్లు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా చాలాచోట్ల ఎక్స్ పని చేయడం లేదని సమాచారం. అయితే, ఎక్స్ పని చేయకపోవడానికి క్లౌడ్‌ఫ్లేర్‌లోని సాంకేతిక సమస్య కారణంగా సమాచారం. అయితే, దీనిపై ఇప్పటి వరకు ‘ఎక్స్’ ఎలాంటి ప్రకటన జారీ చేయలేదు. పలువురు యూజర్లు ఇతర సోషల్ మీడియా వేదికగా ఎక్స్‌తో పాటు పలువురు వెబ్‌సైట్స్ సైతం పని చేయడం లేదని పేర్కొన్నారు. క్లౌడ్‌ఫ్లేర్‌లోని హోస్ట్ సర్వర్ డౌన్ అయ్యిందని ఓ యూజర్ తెలిపాడు. అదే సమయంలో వేలాది మంది డౌన్ డిటెక్టర్‌లోనూ సమస్యలను ఎదుర్కొంటున్నట్లుగా తెలిపారు. ఈ సాంకేతిక లోపం ప్రపంచవ్యాప్తంగా భారీగా కనిపిస్తున్నది. ఎక్స్ మొబైల్ యాప్ నుంచి 61 శాతం మంది ఫిర్యాదు చేయగా.. వెబ్‌సైట్ పని చేయడం లేదని 28శాతం, సర్వర్ కనెక్షన్ లోపాలు తలెత్తినట్లుగా 11శాతంగా మంది ఫిర్యాదు చేసినట్లుగా డేటా పేర్కొంది. అయితే, దీనిపై క్లౌడ్‌ఫ్లేర్ స్పందించింది. క్లౌడ్‌ఫ్లేర్ సిస్టమ్స్‌లో సాంకేతిక సమస్య తలెత్తిందని.. సమస్యను గురించి వేగంగా పరిష్కరిస్తామని పేర్కొంది. అయితే, గత కొంతకాలంగా ఎక్స్ మొరాయిస్తూ వస్తున్నది. తరుచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. దాంతో యూజర్లు ఇబ్బందిపడుతున్నారు.

# డిజిటల్ అరెస్ట్.. ఓ మోసం !

– సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి – కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



మనగళం, కర్నూలు క్రైం : డిజిటల్ అరెస్ట్ అంటేనే మోసం అని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. పోలీసులు ఎప్పుడూ ఫోన్‌లో డబ్బులు అడగరని, 'డిజిటల్ అరెస్ట్' అన్నారంటే వెంటనే ఫోన్ కట్ చేయాలని సూచించారు. "డిజిటల్ అరెస్ట్? అనేది సైబర్ మోసగాళ్ల కుట్ర అని ప్రజలు తెలుసుకుని మసలుకోవాలన్నారు. ఇటీవల "డిజిటల్ అరెస్ట్" అనే పేరుతో సైబర్ మోసాలు ఎక్కువ అవుతున్నాయని, ఇప్పటికైనా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీకి అవకాశం గంటలోపే అని, ప్రజలు అప్రమత్తతే కీలకం అన్నారు. తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా ల ఓ.టి.పి.లను ఎవ్వరికీ చెప్పవద్దని సూచించారు. డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్ళు పోలీసులమని , సీబీఐ అధికారులమని లేదా ఇతర ప్రభుత్వ అధికారులుగా నటిస్తూ వీడియో కాల్స్ చేస్తూ మీ మీద కేసు నమోదైందని, గంజాయి, డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కున్నారని బెదరింపులకు పాల్పడుతారని, ఏ మాత్రం నమ్మొద్దని చెప్పారు. అదేవిధంగా అక్రమ కార్యకలాపాల్లో పాల్గొన్నారని, మీ పేరు మీద కోరియర్ వచ్చిందని, అందులో డ్రగ్స్ ఉన్నాయని లేదా మీ సిమ్/బ్యాంక్ ఖాతా కు వాడబడిందని వచ్చే కాల్స్ ను ఏ మాత్రం నమ్మొద్దన్నారు. పోలీసులు ఎప్పుడూ వీడియో, ఆడియో కాల్స్ చేయరన్న విషయం గ్రహించాలన్నారు. ఎవరికీ కూడా వీడియో కాల్ ద్వారా అరెస్టు గురించి సమాచారం చెప్పడం పోలీసుల పని కాదన్నారు. అసలైన అధికారులు సైతం బ్యాంక్ ఖాతా, ఆధార్, ఓటీపీ అడగరనే విషయాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు.

మోసపోయిన ఆదోని పట్టణ వాసి : కర్నూలు జిల్లా , ఆదోని పట్టణానికి చెందిన ఒక వ్యక్తి కి వీడియో కాల్ వచ్చింది. అతనికి కాల్ చేసిన ఒక వ్యక్తి తాను సీబీఐ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. మీ పేరు మీద డ్రగ్స్ కేసు నమోదైందని, భయభ్రాంతులకు గురిచేశాడు. కేసు పరిష్కారం కోసం వెంటనే మేము చెప్పిన బ్యాంకు ఖాతాలోకి రూ. 1 లక్ష 25 వేలు జమ చేయాలని తెలిపాడు. ఆ మాటలు నమ్మి డబ్బులు పంపి మోసపోయాడు. అదేవిధంగా కర్నూలు పట్టణానికి చెందిన గృహిణి కి ఓ వ్యక్తి నుంచి కాల్ వచ్చింది . అతను పోలీసు అధికారి అని చెప్పి , మీ పేరు మీద బ్యాంక్ అకౌంట్ మిస్‌యూజ్ అయిందని నమ్మబలికాడు. ఆమెకు ఓ లింక్ పంపి, అందులో ఆధార్, బ్యాంక్ డీటెయిల్స్, ఓటీపీ ఇవ్వాలని చెప్పాడు. భయంతో ఆమె అన్ని వివరాలు ఇచ్చేసింది. కొన్ని నిమిషాల్లోనే ఆమె బ్యాంక్ ఖాతా నుండి రూ. 78 వేలు మాయమయ్యాయి. ఇలాంటి మోసాలు జరుగుతూనే ఉన్నాయని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "వీడియో కాల్‌లో 'అరెస్ట్ చేస్తాం' అంటే నమ్మకండి, వెంటనే 1930 కు ఫిర్యాదు చేయండి అని ఎస్పీ చెప్పారు. "మీ భయాన్ని ఆయుధంగా మార్చుకునే సైబర్ క్రిమినల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసులు ఎప్పుడూ గూగుల్ పే/ఫోన్ పే ద్వారా జరిమానా వసూలు చేయరనే విషయాన్ని తెలుసుకోవాలి. ఎవరైనా తెలియని వ్యక్తులు కాల్ చేసి భయభ్రాంతులకు గురి చేస్తే అటువంటి ఫోన్ నెంబర్లను బ్లాక్ చేసి ఆ సమాచారాన్ని స్థానిక పోలీసు స్టేషన్ లోగాని లేదా సైబర్ ల్యాబ్ పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.

## మద్యం తాగి వాహనం నడిపినందుకు జరిమానా

– 10వేలు జరిమానా వారం రోజులు రిమాండ్



మన గళం గోనెగండ్ల: గోనెగండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గాజులదిన్నె ప్రాజెక్ట్ దగ్గర ట్రైనీ ఎస్ఐ అనిల్ కుమార్ నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ లో మద్యం మత్తులో వాహనం నడిపిన మురళి 24 సం, సుబాన్ 21సం యువకుల పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పత్తికొండ లో 10000 జరిమానా వారం రోజులు రిమాండ్ విధించినట్లు గోనెగండ్ల ఇంచార్జ్ ఎమ్మిగనూరు రూరల్ సీఐ చిరంజీవి తెలిపారు

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..!



న్యూఢిల్లీ,నవంబర్ 18, మన గళం: దేశీయ స్టాక్ మార్కెట్లు ఆరు రోజుల లాభాల తర్వాత నష్టాల్లో ముగిశాయి. గ్లోబల్ మార్కెట్‌లో ప్రతికూల పవనాలతో మార్కెట్లు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. అమ్మకాలతో అస్థిరతకు గురయ్యాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం 85,042.37 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో మొదలయ్యాయి. ఇంట్రాడేలో 85,042.41పాయింట్ల వద్ద గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. 84,558.36 పాయింట్ల కనిష్టానికి చేరుకుంది. చివరకు 277.93 పాయింట్ల నష్టంతో 84,673.02 వద్ద స్థిరపడింది.నిఫ్టీ సైతం 103.40 పాయింట్లు తగ్గి 25,910.05 వద్ద ముగిసింది. నిఫ్టీ స్మాల్ క్యాప్ ఇండెక్స్ ఒకశాతం తగ్గింది. అయితే, నిఫ్టీ మిడ్‌క్యాప్ 61,220.25 పాయింట్ల సరికొత్త రికార్డు గరిష్ట స్థాయిని తాకిన తర్వాత 0.6 శాతం దిగువన ముగిసింది. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ ఇంట్రాడేలో 59,103.65 తాజా గరిష్ట స్థాయిని తాకిన తర్వాత స్వల్ప నష్టాలతో ముగిసింది. అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఐటీ, మెటల్, రియాల్టీ ఒక్కొక్కటి ఒకశాతం తగ్గాయి. నిఫ్టీలో భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఆటో, ఏషియన్ పెయింట్స్ ప్రధాన లాభాలను ఆర్జించాయి. టెక్ మహీంద్రా, టాటా కన్స్యూమర్, జియో ఫైనాన్షియల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, బజాజ్ ఫిన్‌సర్వ్ నష్టపోయాయి.

# ఏసీబీ వలన డోన్ డిప్యూటీ తాసిల్దార్ సునీల్ రాజ్...

## – దీని వెనక ఉన్న కథ ఏమిటి ? దీనికి కారకులు ఎవరు

మన గళండోన్ పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం లో గత వారం క్రిందట ఏసీపీకి పట్టిపడిన డిప్యూటీ తాసిల్దార్ సునీల్ రాజుని పట్టించిన రైతు వెనుక ఉన్నవారు ఎవరు అని ఆరా తీయగా దీని వెనక పెద్ద భూకబ్జా ముఠా గ్యాంగ్, మరియు రెవిన్యూ లోని సీనియర్ విఆర్వోలు, కంప్యూటర్ ఆపరేటర్స్ ఉన్నట్లు అనుకుంటున్న సమాచారం...

వివరాల్లోకి వెళితే గత వైసీపీ ప్రభుత్వంలో తాసిల్దార్ గా పనిచేసిన నరేంద్ర నాథ్ రెడ్డి భారీగా ప్రభుత్వ భూములను రికార్డులలో పట్టా భూమిగా మార్చి ఇతరులకు రిజిస్ట్రేషన్ అయ్యే విధంగా చేసి గత వైసిపి ప్రభుత్వం లోని వ్యక్తులకు కట్టబెట్టారు అని సమాచారం.. ఈ దందాలో వైసిపి వ్యక్తులు మరియు సీనియర్ వీఆర్వోలు , కంప్యూటర్ ఆపరేటర్స్ కుమ్మక్కై,

**కోట్లు విలువచేసే ప్రభుత్వ భూములను కాజేశారని బహిరంగంగా చర్చించుకుంటున్న విషయం ..**

ఈ ముఠా చేసిన వ్యవహారం అంతా ప్రస్తుతం తాసిల్దారు గమనించి గత వైసిపి ప్రభుత్వంలో పట్టా భూములుగా మారిన ప్రభుత్వ భూములను గుర్తించి వాటికి సంబంధించిన రికార్డులను సరి చేసే కార్యక్రమం చేపట్టారు.. ఈ విషయం జీర్ణించుకోలేని ఈ ముఠా సభ్యులు మరియు కొంతమంది వీఆర్వోలు ప్రస్తుతం తాసిల్దారు రికార్డును సరి చేస్తే వీరు చేసిన మోసాలు, తప్పిదాలు బయటపడి మేము ఎక్కడ జైలుకు వెళతాము అని ఊహించి భయపడి వెల్దుర్తి మండలం గుంటుపల్లి గ్రామ రైతు ద్వారా ఇద్దరు సీనియర్ విఆర్వోలు మరియు కంప్యూటర్ ఆపరేటర్స్




తాసిల్దారు ని ఏసీబీకి పట్టించాలని పథకం రచించినట్లు సమాచారం.. వీరే స్వయంగా ఈ రైతును కర్నూలు ఏసీబీ ఆఫీస్ వారి దగ్గరికి పంపించడంలో కీలకపాత్ర బాత్రూం వహించినట్లు ప్రజలు భరింగ ప్రదేశాలలో చర్చించుకుంటున్నారు.. దీనికి రుజువుగా సీనియర్ విఆర్ఓ కాల్ డేటా ఆ రోజు అతని లొకేషన్స్ , కర్నూల్ లో ఇతను తిరిగిన సీసీ ఫుటేజెస్ సేకరించగలిగితే పూర్తి వాస్తవాలు బయటపడతాయి .. సస్పెండ్ అయిన డిప్యూటీ తాసిల్దార్ సునీల్ రాజ్ కి న్యాయం జరుగుతాదని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.. ఇప్పుడైనా ఈ చెడు అధికారులను మార్చమని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు...

## అన్నదాతలకు శుభవార్త: పీఎం కిసాన్ రెండో విడత నిధుల విడుదలకు రాష్ట్రం సిద్ధం

మన గళం ,పెద్ద దోర్నాల, నవంబర్ 18, 2025: రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వాల ప్రధాన ధ్యేయమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరోసారి చాటుకున్నాయి. అన్నదాత సుఖీభవ -- పీఎం కిసాన్ పథకం రెండో విడత నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైనట్లు దోర్నాల మండల మాజీ బీజేపీ అధ్యక్షులు సురవరం వీరా రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి రైతు కుటుంబం అభ్యున్నతే లక్ష్యంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరియు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన సూపర్ సిక్స్ హామీల అమలు వేగంగా జరుగుతోందని తెలిపారు. రైతులకు ఏటా రూ. 20,000 ఆర్థిక సాయం అందించాలన్న సంకల్పంతో, రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతగా రూ. 7,000ను ఇప్పటికే 2025 ఆగస్టు 2న రైతుల ఖాతాల్లో జమ చేసిన విషయం గుర్తుచేశారు. ఇప్పుడు రెండో విడత నిధులు విడుదలకు సిద్ధమవుతున్నాయని, ఈ విడత ద్వారా 46.86 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనున్నట్లు సురవరం వీరా రెడ్డి పేర్కొన్నారు. రైతు కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడేందుకు ఈ చర్యలు ఎంతో తోడ్పడతాయని ఆయన వెల్లడించారు.





## వైఎస్సార్సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం



ముక్కెళ్ల : మన గళం :: తుగ్గలి మండలం ముక్కెళ్ల గ్రామంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించే ప్రభుత్వ నిర్ణయానికి తీవ్ర వ్యతిరేకంగా వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ గారు గ్రామంలోని వైఎస్ఆర్ పార్టీ నాయకులతో కలిసి ప్రజలనుండి సంతకాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె "ప్రభుత్వ వైద్య కళాశాలలు పేద మరియు మధ్యతరగతి విద్యార్థుల ఆశల నిలయాలు. వాటిని ప్రైవేటీకరించడం అంటే పేదల విద్యా హక్కును దోపిడీ చేయడమే. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణం వెనక్కి తీసుకోవాలి,"అని డిమాండ్ చేశారు అలాగే వైద్య రంగంలో ప్రజలకు అందుబాటులో ఉన్న సేవలను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు అందే వరకు వైఎస్సార్సీపీ పోరాటం కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కెళ్ల గ్రామం వైఎస్ఆర్ పార్టీ నాయకులు, రాష్ట్ర అనుబంధ కమిటీ సభ్యులు, జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా కమిటీ నాయకులు, సర్పంచులు, ఎంపిటీసీలు, వైఎస్ఆర్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఇంటి స్థలాల మంజూరుకు చర్యలు తీసుకోవాలి

**– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**






మనగళం, నంద్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హౌసింగ్ కొత్త స్కీమ్ గురించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి అర్హులకు ఇంటి స్థలాల మంజూరుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తహసీల్దారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తహసీల్దార్లతో పలు రెవెన్యూ అంశాలపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ లబ్ధిదారులు ఆయా పరిధిలోని సచివాలయాలలో ఇంటి స్థలాలకు ఆన్లైన్లో అప్లై చేసుకునే విధంగా తెలియజేయాలన్నారు. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే పీజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే దరఖాస్తులను ఆన్లైన్ చేసి వారికి రసీదు ఇవ్వాలన్నారు. తాసీల్దార్ కార్యాలయంలో అర్జీదారుల దరఖాస్తులను ఆన్లైన్ చేయకుండా బాధితులకు సకాలంలో న్యాయం చేయకపోవడంతో వారు జిల్లా కేంద్రంలో జరిగే పి జి ఆర్ ఎస్ కార్యక్రమానికి వస్తున్నారన్నారు. పి జి ఆర్ ఎస్ అర్జీలను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో భూ సమస్యలపై రెవెన్యూ సిబ్బంది వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. పట్టా భూములను 22 ఏ లో చేర్చడానికి వీలు లేదని, అలా ఎక్కడైనా జరిగినట్లయితే వెంటనే 22 ఏ లో నుంచి పట్టా భూములను తొలగించాలన్నారు. ఇకనుంచి కార్యాలయపు ఫైళ్ళన్నీ సంబంధిత అధికారుల ఈ సైన్ తో ఈ ఆఫీస్ ద్వారానే తమకు సమర్పించాలని కలెక్టర్ తాసీల్దార్లను ఆదేశించారు. జిల్లా ర్యాంకింగ్ కూడా ఈ ఆఫీస్ ఫైళ్ళు, సంతృప్త స్థాయిలో ఫిర్యాదుల పరిష్కారంపై ఆధారపడి ఉంటుందన్నారు. జిల్లాలో శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలకు వచ్చిన దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి అర్హులందరికీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పలు రెవెన్యూ అంశాలపై తహసీల్దార్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, ఆర్డీవోలు, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

- పరిశ్రమలు ఏర్పాటుతో జిల్లా అభివృద్ధి
- కలెక్టర్ రాజకుమారి గణియా



మనగళం, నంద్యాల: సింగిల్ డెస్క్ విధానం ద్వారా జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని, దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని డ్వామా కార్యాలయంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ జిల్లాలో గత త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ మొత్తం 686 దరఖాస్తులు అందగా సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 652 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశారని, 32 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులు అన్నింటి పైన నిర్దిష్ట గడువులోపున తగిన పరిష్కారం అందించాలని పర్యావరణ పరిరక్షణ ఫ్యాక్టరీస్ శాఖల అధికారులను ఆదేశించారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కొరకు పెట్టుబడి రాయితీ పావలా వడ్డీ విద్యుత్తు సేల్ టాక్స్ తదితర రాయితీల కింద జిల్లాలో ఉత్పాదన సేవా రంగాల్లోని 4, యూనిట్లకు మొత్తం 11.14 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ ఆమోదం తెలియజేసింది. ఈ సమావేశంలో సభ్యులందరికీ నూతనంగా ప్రవేశపెట్టిన పారిశ్రామిక విధానాల ఆచరణ కొరకు విడుదల చేసిన విధివిధానాలను వివరించి నూతన పరిశ్రమల స్థాపనకు వారు సహకరించవలసిందిగా జనరల్ మేనేజర్ వారు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎస్ మహబూబ్ బాషా, ఎల్డీఎం రవీందర్ కుమార్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ ఈ కిషోర్ రెడ్డి, డిపిఓ లలిత భాయ్, రవాణా శాఖ అధికారి వివిధ శాఖల జిల్లా అధికారులు పరిశ్రమల అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# డౌరీ ప్రొహిబిషన్ యాక్ట్ ను పకడ్బందీగా అమలు చేయాలి

**– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



మనగళం, నంద్యాల: జిల్లాలో డౌరీ ప్రొహిబిషన్ యాక్ట్ ను పగడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. కలెక్టరేట్లోని తమ చాంబర్ నందు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా జూమ్ వీసీ ద్వారా డౌరీ ప్రొహిబిషన్ యాక్ట్ పై జిల్లా ఎస్పీ, జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలు, ఐసిడిఎస్ పిడి, లతో డిస్టిక్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ....డౌరీ ఇచ్చుకోవడం పుచ్చుకోవడం చట్టరీత్యా నేరమని, యాక్ట్ ను పక్కాగా పకడ్బందీగా అమలు చేసేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. డౌరీ పైన ఎక్కడైనా నేరాలు జరిగినట్లయితే జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, లకు అరెస్టు చేయడం పెనాల్టీ వేయడం వంటి హక్కులు ఉంటాయన్నారు. డౌరీ కేసు కింద ఎవరైనా డౌరీ మర్డర్, డౌరీ డెత్ లు జరిగినట్లయితే బాధిత కుటుంబ సభ్యులకు 50,000 రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో డౌరీ నేరాలు హత్యలు పూర్తిగా నివారించేందుకు డౌరీ ప్రొహిబిషన్ యాక్టును పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డౌరీ యాక్ట్ కు సంబంధించిన పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు.

# చైనా ఫార్ములాలో.. యువత 72 గంటలు పనిచేయాలి

న్యూఢిల్లీ,నవంబర్ 18, మనగళం: ఇన్ఫోసిస్ ఫౌండర్ ఎన్ఆర్ నారాయణ మూర్తి మరోసారి హెడ్‌లైన్స్‌లో నిలిచారు. ప్రపంచ స్థాయిలో ఇతర దేశాలతో భారత్ పోటీ పడాలంటే యువతరం వారానికి 70 గంటలు పని చేయాలని ఆయన చేసిన వ్యాఖ్యలు పెద్ద ఎత్తున చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా ఆయన మరోసారి అలాంటి వ్యాఖ్యలే చేశారు. మన దేశం వేగంగా అభివృద్ధి చెందాలంటే యువత వారానికి 72 గంటలు పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా చైనాలో ప్రసిద్ధి చెందిన 9-9-6 రూల్‌ను ఉదాహరణగా చెప్పారు.ఓ టీవీ ఛానెల్‌తో మాట్లాడిన మూర్తి.. చైనా ఆర్థిక వ్యవస్థను ఎదుర్కోవాలంటే యువత మరింత కష్టపడి పనిచేయాలన్నారు. 'చైనాలో 9-9-6 అనే పాలసీ ఉంది. దాని అర్థం ఏంటో తెలుసా..? ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ వారానికి 6 రోజులు పనిచేయడం. మొత్తం 72 గంటలు పనిచేయడం' అని అన్నారు. భారతీయ యువత ఈ పనిగంటలను అనుసరించాలని వ్యాఖ్యానించారు. ముందు యువత తమ కెరీర్ నిర్మించుకోవడంపై దృష్టిపెట్టాలని తర్వాతే వర్క్-లైఫ్ బ్యాలెన్స్ గురించి ఆలోచించాలని సూచించారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.కాగా, ఆర్థిక వ్యవస్థ ఉరకలెత్తేందుకు, ఉత్పాదకత పెరిగి మనం అగ్ర దేశాలతో పోటీ పడాలంటే యువతరం వారానికి 70 గంటలు పని చేయయాలని ఇన్ఫోసిస్ ఫౌండర్ ఎన్ఆర్ నారాయణ మూర్తి వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. 'ప్రపంచంలోకెల్లా భారత్‌లోనే ఉత్పాదకత అతి తక్కువ. ఉత్పత్తిలో మన పని మెరుగు పర్చుకోలేకపోయినా, ప్రభుత్వంలో కొంత స్థాయి వరకూ అవినీతి తగ్గించకపోయినా.. అద్భుతమైన ప్రగతి సాధించిన దేశాలతో మనం పోటీ పడలేం' అని నారాయణ మూర్తి స్పష్టం చేశారు. 'నా యువతరానికి నేను చేసే రిక్వెస్ట్ ఒకటే.. 'ఇది నా దేశం. నా దేశం కోసం నేను వారానికి 70 గంటలు పని చేస్తాను' అని తప్పనిసరిగా ప్రతిజ్ఞ చేయాలి%-% అని నారాయణ మూర్తి చెప్పారు. అయితే, ఆయన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఇంత సుదీర్ఘ గంటలు పనిచేస్తే మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపడంతో పాటు పని-జీవితం మధ్య సమతూకం దెబ్బతింటుందనే విమర్శలు వెల్లువెత్తాయి.

# దిగి వచ్చిన బంగారం ధరలు..



హైదరాబాద్, నవంబర్ 18 ,మనగళం:
కొన్ని రోజులుగా స్థిరంగా కొనసాగుతున్న బంగారం ధర మంగళవారం కిందకు దిగి వచ్చింది. ఈ రోజు (నవంబర్ 18) మధ్యాహ్నం 1:00 గంటల సమయంలో ప్రకారం హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 23, 660కి చేరింది నిన్నటితో పోల్చుకుంటే దాదాపు రూ. 1,740 తగ్గింది.ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 13, 350కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే దాదాపు రూ. 1,600 తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్లలో తగ్గుదలకు అనుగుణంగా మన దేశంలో బంగారం ధరల్లో స్థిరీకరణ జరగడమే ఈ తగ్గుదలకు కారణంగా కనిపిస్తోంది . ఇక, ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 23, 810కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 13, 500కి చేరుకుంది.ఇక, వెండి ధరల్లో కూడా భారీ తగ్గుదల నమోదైంది. కేజీకి 5,000 రూపాయల మేర వెండి ధర తగ్గింది . హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ. 1, 70, 000గా ఉంది. ఇక, ఢిల్లీలో కిలో వెండి ధర రూ.1, 62, 000గా ఉంది.

# క్రమ శిక్షణ పేరుతొ విద్యార్థులను చితక బాదుతున్న ఉపాధ్యాయులు...

- **జిల్లా పరిషత్ హైస్కూల్ లో ఆ ఉపాధ్యాయులు హోవ**
- **మాకు అందరూ నాయకులు తెలుసు మమల్ని ఎవరు ఏమి అనరు**
- **ఎవరికైన చెబితే టీసి ఇస్తాం అని బెదిరింపులు**





నందవరం : నవంబర్ 18 మన గలం న్యూస్ : విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలతో పాటు సరైనా విద్యాబుద్ధులను నేర్పుతున్న ఉపాధ్యాయులను చూసే ఉంటాం. పిల్లలను తమ సొంత బిడ్డల వలే భావించి వారి ఉన్నతి కోసం పాటు పడిన వారిని చూసే ఉంటాం. కానీ నందవరం జిల్లా పరిషత్ హైస్కూల్ లో ఆ ముగ్గురి ఉపాధ్యాయుల రూటే వేరు.విద్యార్థులు తమ మాట వినడం లేదని ఆగ్రహానికి గురై ఏదో ఒక కారణంతో విద్యార్థులను చితక బాదటం పనిగా పెట్టుకున్నారు .మంగళవారం కొంతమంది విద్యార్థులను స్టేజి పైకి ఎక్కించి, వారిని ఏమిటి మీ కటింగ్ లు అంటూ చితక బాధరాని కొంతమంది విద్యార్థులు,లోలోన ఆవేదనకు గురి చెందారు.ఎవరికైన చెబితే మీకు, టీసి లు ఇస్తాం అంటూ బెదిరిస్తున్నట్లు సమాచారం. విద్యార్థుల ఎవరికి చెప్పుకోలేక లోలోన భయపడుతూ ఆందోళన గురి చెందుతున్నారు. ఆ ఉపాధ్యాయులు ఎవరు ఎమైనా మమల్ని అంటే మాకు లోకల్ లీడర్లు తెలుసు, నాయకులు తెలుసు అని చెప్పుకోస్తున్నారని, సమాచారం.ఇక్కడ పాఠశాలలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు మాత్రం కుర్చీకే పరిమితం కావాలి. ఏ సమస్య వచ్చిన వారే మాట్లాడాలి, ఏ అధికారి వచ్చిన వారే వివరణ ఇవ్వాలి, క్రమశిక్షణ పై వున్న శ్రద్ధ, విద్యార్థులకు చదువు చెప్పడం లో ఉంటే బాగుంటుందని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఆ ముగ్గురి ఉపాధ్యాయులకు గంటల కొద్ది సెల్ ఫోన్ లో కబురలు చెప్పడం, చెట్లకింద కాలయాపన చేయడం పరి పాటిగా మారింది.విద్యార్థులను చితకబాదిన ఆ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.ఇప్పటికైన ఆ ఉపాధ్యాయులు క్రమశిక్షణ, కటింగ్ లపై కాకుండా విద్యార్థుల చదువు చేప్పడంలో దృష్టి పెట్టాలని విద్యార్థుల సంఘాల నాయకులు విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# బయలు వీరభద్రస్వామికి ప్రదోషకాల అభిషేకం

మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (18.11.2025) సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామివారికి విశేషపూజలను జరిపించనున్నది. ప్రతీ మంగళవారం మరియు అమావాస్యరోజులలో బయలువీరభద్రస్వామివారికి ఈ విశేష అభిషేకం, అర్చనలను నిర్వహించబడుతున్నాయి. బయలువీరభద్రస్వామివారు శివభక్తగణాలకు అధిపతి. అదేవిధంగా శ్రీశైలక్షేత్రపాలకుడుగా క్షేత్రానికి ఆరుబయట ఉండి, ఎటువంటి ఆచ్ఛాదన, ఆలయం లేకుండగా బయలుగా దర్శనమిస్తాడు కనుక ఆయనకు బయలువీరభద్రస్వామి అని పేరు వచ్చింది. ప్రసన్నవదనంతో కిరీట మకుటాన్ని కలిగి దశభుజుడైన స్వామివారు పది చేతులలో వివిధ ఆయుధాలతో దర్శనమిస్తాడు. స్వామివారికి క్రిందివైపున కుడివైపు దక్షుడు, ఎడమవైపు భద్రకాళి దర్శనమిస్తారు. ఈ స్వామిని దర్శించినంత మాత్రానే ఎంతటి క్లిష్ట సమస్యలైనా తొలగిపోతాయని, వ్యాధులు నశించి ఆయురారోగ్యాలు చేకూరుతాయని ప్రసిద్ధి. ముఖ్యంగా ఆగమసంప్రదాయంలో క్షేత్రపాలక పూజకు చాలా విశేషస్థానం ఉంది. క్షేత్ర పాలకుడికి పూజలు చేయడం వలన ఆ క్షేత్రంలో ఉన్నటువంటి భక్తులు ఎటువంటి భయం,బాధలు లేకుండా సుఖసంతోషాలతో ఉంటారు. మంగళవారం, ఆదివారం మరియు అమావాస్య రోజులలో చేసే వీరభద్రపూజ అనేక ఫలితాలు ఇస్తుందని ఆగమశాస్త్రాలు చెబుతున్నాయి. ఈ స్వామిపూజతో సకలగ్రహ అరిష్టదోషాలు, దుష్టగ్రహపీడలు తొలగిపోతాయి. అదేవిధంగా సంతానం, ఐశ్వర్యం మొదలైన అనేక శుభఫలితాలు చేకూరుతాయి. ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించడం జరుగుతుంది.



# నందీశ్వరస్వామికి విశేషపూజ



మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (18.11.2025) ఆలయ ప్రాంగణంలోని నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించనున్నది. ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ప్రదోషకాలంలో అనగా సాయం సంధ్యా సమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్ని ప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహా గణపతి పూజను జరిపించ బడుతుంది. ఆ తరువాత నందీశ్వర స్వామికి శాస్త్రోక్తంగా పంచా మృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికా గుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. వృషభసూక్తం మొదలైన వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వర స్వామి వారికి నూతనవస్త్ర సమర్పణ, విశేష పుష్పా ర్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది. చివరగా స్వామికి నివేదన సమర్పించబడుతుంది.

# జివిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శించిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్

మన గళం కోడుమూరు : కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలోని స్థానిక జి.వి.ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కర్నూల్ హెచ్ గోవింద నాయక్ మరియు ఆదాం భాష ఎంఈఓ 2 సి.బెలగళ్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి గత సంవత్సర ఫలితాలను విశ్లేషిస్తూ ఈసారి మంచి ఫలితాలు తీసుకురావడానికి తల్లిదండ్రులు మరియు విద్యార్థులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల వెనుకబాటుతనాన్ని గుర్తించి పాఠశాలలోని విద్యార్థులందరూ 10వ తరగతి పరీక్షలలో పాస్ అయ్యే విధంగా కృషి చేయాలని సూచించారు. మరియు పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి పదవ తరగతి పరీక్షలకు అవసరమైన ఇన్ఫ్రాస్ట్రక్చర్లు ఉండే విధంగా చూసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జే. రామచంద్రుడు ఆదేశించారు. ఈ సమావేశంలో ఉస్మాన్ భాష, రత్నానాయక్,



ఆదామ్ షరీఫ్, నవినే పాటి, సోమశేఖర్, శ్రీనివాసరెడ్డి, ఎల్లారెడ్డి మొదలగు ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

# శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (18.11.2025) ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించ బడుతున్నాయి. కుమార స్వామి వారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహా గణపతి పూజ జరిపించబడింది. అనంతరం శ్రీసు బ్రహ్మణ్య స్వామి వారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్య స్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు ,పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

# మండల స్థాయి టీచ్ టూల్ ఓరియెంటేషన్ ట్రైనింగ్

మన గళం కోడుమూరు: తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలను మెరుగుపరిచే విధంగా మండల స్థాయి రెండు రోజుల టీచ్ టూల్ ఓరియెంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ జివిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రారంభించడం జరిగింది. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాము మండల విద్యాశాఖ అధికారులు కే వసంత లక్ష్మీబాయి మరియు అజారయ్య బాబు మరియు పాఠశాల క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు జె రామచంద్రుడు పర్యవేక్షణలో డిఆర్పీలుగా చిన్న మాదన్న మరియు చాంద్ బాషా వ్యవహరించారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కు మండలంలోని 30 మంది టీచ్ టూల్ అబ్జర్వర్స్ మరియు సీఆర్పీలు భాస్కర్, దాదాభాష, సోమేశ్వరి, ఏకాంత్, సుధాకర్ లు పాల్గొనడం జరిగింది.



# సీసీఐ కొత్తగా ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్ తో రైతులకు మేలు

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలో పత్తి కొనుగోలులో అక్రమాలకు చెక్ పెట్టేందుకు సీసీఐ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టిందని కాపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ అన్నారు. మంగళవారం కోడుమూరు మండలంలోని ఆమడగుంట్ల గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం రైతు సేవా కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ వరలక్ష్మి, గ్రామ రైతులు పాల్గొన్నారు. అలాగే రైతు సేవా కేంద్రం సిబ్బంది బజారి, ఏఈఓ బాలకృష్ణ, సెరికల్చర్ అసిస్టెంట్ సావిత్రి పాల్గొన్నారు.

గ్రామంలో ఎక్కువగా పత్తి పంట, కంది పంటలు సాగు చేసినందువలన ప్రతిని రైతులకు మద్దతు ధరకు సీసీఐకి అమ్ముకోవలసినదిగా రైతులకు తెలిపి సీసీఐకి పత్తిని తీసుకొని వెళ్లేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకి తెలిపారు. రైతుకు పండిన పత్తి మొత్తాన్ని కూడా సీసీఐకి అమ్ముకోవడానికి ప్రభుత్వము అనుమతులు ఇచ్చిందన్నారు. తేమశాతం, గొంగిపత్తి లేకుండా ఉన్న యెడల రైతుకు ఇబ్బంది ఉండదని తెలిపారు. కపాస్ కిసాన్ యాప్ లో రిజిస్ట్రేషన్లు నెమ్మదిగా అవుతున్నందువలన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు మొత్తం పండిన



పంటను తప్పకుండా సిసిఐ కొనుగోలు చేస్తుంది దానికి వ్యవసాయ శాఖ సిబ్బంది మార్గదర్శకంగా ఉంటూ రైతుకి ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు. అలాగే కంది పంటను పరిశీలించారు. కంది పంటలో ఈసారి పచ్చ పురుగుల, లద్దె పురుగు తక్కువ ఉధృతి ఉన్నది అని రైతులకి తెలిపారు. పచ్చ పురుగుల, లద్యపురుగు



నివారణ కోసం ఇమామెక్టిన్ బెంజోయేట్ ఎకరానికి 100 గ్రాములు లేదా ఎస్సిపేట్ ఎకరానికి 250 గ్రాములు స్ప్రే చేసుకోవాల్సిందిగా రైతులకు చూపించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామ సర్పంచ్ వరలక్ష్మి మాట్లాడుతూ రైతులకు పత్తి కొనుగోలులో ఇబ్బందులు లేకుండా ఉండాలని అధికారులను కోరారు ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారులు మరియు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మహేంద్ర అంకాల యొక్క పొలమును పరిశీలించిన ఏఈ మరియు వర్క్ ఇన్స్పెక్టర్

మన గళం కోడుమూరు: మహేంద్ర అంకాల బ్రాహ్మణ దొడ్డి గ్రామం సి.బెళగల్ మండలం మీకోసం లో 27వ తేదీ 10వ నెల 2005వ తేదీన అర్జీ ఇచ్చినారు అర్జీపై వివరణ బ్రాహ్మణ దొడ్డి గ్రామంలో గల సర్వేనెంబర్ 638/2 లో మూడు ఎకరంలో పొలము ఉన్నది ఇతని చేసుకొ దక్షిణ భాగమున బారిక శ్రీనివాసులు ఒక 643 సర్వే నంబరు నందు పది ఎకరంలో పొలం ఉంది ఈ పొలంలోకి ఎల్ఎల్సీ కాలువ నుండి నీరును మళ్లించుతున్నారని బాధితుడు అంకాల మహేంద్ర ఆరోపించారు ఈ ఆరోపణ పరిశీలించడానికి పోల్కల్ డివిజన్ ఏఈ సూర్య ప్రకాష్ మరియు ఉప కార్య నిర్వాహక ఇంజనీర్ సుబ్బారాయుడు 12వ తేదీ 11వ నెల 2025వ తేదీన అనగా బుధవారం మహేంద్ర అంకాల యొక్క పొలంలో పరిశీలించినారు మహీంద్రా అంకాల తో మాట్లాడి ఎల్ఎల్సీ కాల్వకు వైపు కల్వర్టు మరియు జంగిల్ క్లియరెన్స్ ప్రతిపాదనలు పంపిన యెడల పైన చెప్పిన సమస్య పరిష్కారం అవుతుందని తెలిపియున్నారు కావున మా మరియు ఎస్టిమేట్స్ రెడీ చేసి ఒక కాపీని ఆదోని డివిజన్ ఆఫీసర్ కు పంపించామన్నారు మరియొక కాఫీని బాధితుడైన అంకాల మహీంద్రా ఇచ్చామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు బాధితుడు అంకాల మహేంద్ర తనకు తగిన న్యాయం చేయాలంటూ ఈ సందర్భంగా స్థానిక సంబంధించిన అధికారులను కోరుకున్నాడు



# శ్రీశైలం ఘాట్లో బస్సు- బైకు ఢీకొని యువకుడి మృతి

మనగళం శ్రీశైలం : శ్రీశైలం-దోర్నాల ఘాట్లో మంగళవారం సాయంత్రం మార్కాపురం డిపో చెందిన ఆర్టీసీ బస్సు, బైకు ఢీకొన్నాయి. మార్కాపురం నుంచి శ్రీశైలం వస్తున్న బస్సు.. శ్రీశైలం నుంచి దోర్నాల వైపు వెళ్తున్న బైక్ ఢీకొనడంతో బైక్పై ఉన్న యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





## రోడ్డు మధ్యలో కరెంట్ స్థంభం అడ్డంగా ఉన్న అడిగేది ఎవరు.

**– తొలగించమని వేడుకున్నా, నిర్లక్ష్యం వహిస్తున్న విద్యుత్ అధికారులు.**



(ఆలూరు మనగళం): ఆలూరు మండలం, మొలగవల్లి గ్రామంలో బస్టాండ్ నుండి చెరువు కట్ట వైపు గ్రామంలోకి వెళ్లే ప్రధాన రోడ్డులో గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్థంభం ప్రజలకు ఇబ్బందిగా మారింది. పలుమార్లు విద్యుత్ అధికారులకు రోడ్డుపై ఉన్న కరెంట్ స్తంభాన్ని తొలగించమని అడిగినా తొలహించడం లేదని ఇప్పుడు ప్రధాన దారిలో సిసి రోడ్డు వేస్తున్నారని దానిని అలాగే ఉంచితే వాహనాలు తిరగడానికి ఇబ్బందిగా మారుతుందని గ్రామస్థులుతో పాటు సర్పంచ్ మోహన్ రాజ్, ఎంపిటిసి సునంద పటేల్ యాదవ్ లు తెలిపారు. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి కరెంట్ స్తంభాన్ని తొలగించాలని గ్రామస్తులు కోరారు.

## భీమలింగేశ్వర స్వామికి అన్న తర్పణ అభిషేకం.

– ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇచ్చిన భీమలింగేశ్వరుడు.



( ఆలూరు మనగళం ): ఆలూరు పట్టణంలో స్థానికంగా కోట వీధిలో వెలసిన శ్రీ శ్రీ భీమలింగేశ్వర స్వామి వారికి కార్తీకమాసం, త్రయోధసి సందర్బంగా శివాలయంలో భీమలింగేశ్వర స్వామి వారికి అన్న తర్పణ అభిషేకం కార్యక్రమం నిర్వహించారు. పంచామృత అభిషేకం, బిల్వఅర్చన, మరియు మహమంగళ హారతి కార్యక్రమం నిర్వహించారు. భీమలింగేశ్వర స్వామి వారు ప్రత్యేక అలంకరణలో స్వామి వారు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులు తీర్ధ, ప్రసాదలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు యుగంధర్ స్వామి, గంగాధర్, గాదిలింగ, శేఖర్, రాజు, గోవిందు, వినోద్ మరియు భక్తాదులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో భగవంతుని పూజిస్తే... జీవితం పరిపూర్ణం.

**– ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప.– ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి.**



( ఆలూరు మనగళం ): కర్నూలు జిల్లా, ఆలూరు నియోజకవర్గం, చిప్పగిరి మండల కేంద్రంలో ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప స్వామి ఊరేగింపు మహొూత్సవంలో పాల్గొన్న ఆలూరు ఎమ్మెల్యే బూసినె వీరుపాక్షి. శ్రీ అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వీరుపాక్షి స్వామి మాట్లాడుతు ప్రతి ఒక్కరు దైవ చింతన అవాలంబించుకోవాలని తెలిపారు. భక్తిశ్రద్ధలతో భగవంతుని పూజిస్తే, ప్రతి ఒక్కరి జీవితం పరిపూర్ణం అవుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరు ఏమ్మెల్యే బుసినే విరుపాక్షి గురుస్వామి మరియు సోదరుడు బుసినే శ్రీరాములు స్వామి, అయ్యప్ప స్వామి భక్తి మండలి, అయ్యప్ప స్వాములు, శివ స్వాములు, ఆంజనేయ స్వాములు, భవాని స్వాములు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొనారు.

## రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలి





మనగళం, ఆళ్లగడ్డ : రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు సంబంధిత అధికారుల పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సూచించారు. ఈ మేరకు ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో కలిసి ఆళ్లగడ్డ హైవేను పరిశీలించారు. యాక్సిడెంట్ నియంత్రణకు సంబంధించి ఉన్నతాధికారులతో మాట్లాడామని ఎమ్మెల్యే చెప్పారు. ఆళ్లగడ్డ టిడ్కో గృహాల వద్ద కొద్దిరోజుల క్రితం యాక్సిడెంట్ జరిగి వ్యక్తి మృతి చెందారని గుర్తు చేశారు. టిడ్కో గృహాల వద్ద ఒకే రూటు ఉండటం వలన యాక్సిడెంట్లు జరుగుతున్నాయని, దీనికి సంబంధించి త్వరలోనే సర్వీస్ రోడ్డు వేయించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ రద్దు చేయాలి



**– కోటిసంతకాల సేకరణ ఎమ్మెల్యే వీరుపాక్షి**

( ఆలూరు మనగళం ): ఆలూరు నియోజకవర్గం, దేవనకొండ మండలం, తెర్నేకల్ గ్రామంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయకూడదు అని కోటి సంతకల సేకరణ రచ్చ బండ కార్యక్రమంలో పాల్గొన్న ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి మాట్లాడుతూ, ఈ కూటమి ప్రభుత్వం విద్య వైద్యాన్ని వ్యాపారం చేస్తున్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తూ పేదలకు వైద్యం అందకుండా చేస్తున్నారు. పీపీపీ విధానాన్ని రద్దు చేసేందుకే కోటిసంతకాల సేకరణ చేస్తున్నాము అని అన్నారు. పీపీపీ విధానాన్ని రద్దు చేసేవరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటలు చేస్తూనే ఉంటుంది. గ్రామంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు అందరు కలిసి ప్రతి ఇంటికి వెల్లి కోటి సంతకల సేకరణ చేయాలని తెలియజేశారు. ఆలూరు ఏమ్మెల్యే బుసినే విరుపాక్షి సమక్షంలో గ్రామ అనుబంధ విభాగల కమిటీ నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెర్నేకల్ మధుసూదన్ రెడ్డి, తెర్నేకల్ సురేంద్ర రెడ్డి వైస్సార్సీపీ మండల కన్వీనర్, జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గం కార్యవర్గ సభ్యులు, మండల కార్యవర్గ సభ్యులు,వైస్ ఎంపీపీ లు ఎంపీటీసీలు, కో కన్వీనర్, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, బీవీర్ అభిమానులు పాల్గొన్నారు.

# అరికేరి గురుకులం వార్తలకు స్పందించి, ఆకస్మిక తనిఖీలు చేసిన డీసీవో శ్రీదేవి.

- **విచారణలో భాగంగా డీసీవో ను వాయిస్ ఇవ్వాలని కోరగా, నిరాకరించిన జిల్లా అధికారిణి.**
- **అరికేర గురుకుల వివాదం మళ్లీ హాట్ టాపిక్ గా మారింది.**
- **అరికేర గురుకులంలో విద్యార్థుల మనోవేదన అర్థం చేసుకొని అధికారులు.**
- **అధికారుల వైఖరిపై స్థానికుల ఆగ్రహం.**
- **అవకతవకల ఆరోపణలు పెద్దవవుతుండగా, అధికారులు స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలు.**
- **ఆర్ట్ టీచర్, సెక్యూరిటీ గార్డుపై వరుస అభియోగాలు, చర్యలు మాత్రం సూన్యం.**
- **ఫిర్యాదులను పట్టించుకోలేదన్న విద్యార్థి తల్లిదండ్రులు.**








( ఆలూరు మనగళం ) ఆలూరు మండలం, అరికెర డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల బాలుర వసతి గృహం ప్రస్తుతం పలు వివాదాలతో హాట్‌టాపిక్‌గా మారింది. హాస్టల్‌లో పిల్లల ఆగచట్లు ఉన్నాయన్న ఆరోపణలతో పాటు, కొంతమంది ఉపాధ్యాయుల ప్రవర్తనపైనా తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

ఉపాధ్యాయులు విద్యార్థులతో గొడ్డు చాకిరీ చేయిస్తున్నారనే ఆరోపణలు హాస్టల్‌లో పిల్లలతో పనులు చేయిస్తున్నారని, వారు అనవసర ఒత్తిడులు ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వీటిపై మంగళవారం కొన్ని పత్రికలో వార్తలు వెళ్ళబడ్డాయి. అందులో భాగంగానే జిల్లా అధికారి డిసిఓ శ్రీదేవి, మంగళవారం అరికేర గురుకులలో విచారణకు వచ్చింది. అయితే విచారణ కోసం వచ్చిన అధికారిని వివరణ కోసం విలేకరులు సంప్రదించగా, ప్రశ్నలకు దూరంగా ఉండటమే కాకుండా స్పందించకుండా వెళ్లిపోయింది. దీనితో స్థానికుల్లో, విద్యార్థి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. విలేకరుల సమక్షంలోనే తొమ్మిదో తరగతి చదువుతున్న ఒక విద్యార్థి, ఆర్ట్ టీచర్ అక్షయ్య తనను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని విన్నవించినప్పటికీ, అధికారి ఆ విద్యార్థిని మందలించి పంపించింది. ఏంటా విద్యార్థి బాధను చెబుతున్న కూడా పట్టించకపోవడంపై డి సి ఓ పై తల్లిదండ్రులు అగ్రవేశంగా ఉన్నారు. ఆయనకు వత్తాసు పలుకుతూ ఆయన కి మానసిక స్థితి సరిగ్గా లేదని చెప్తుంది. ఈ విషయంలో విద్యార్థులు తల్లిదండ్రులు ఆయనతో ఎంతో పుచ్చుకునేందో ఆమె అనే విధంగా మాటలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై స్థానికులు విద్యార్థుల మాట వినడానికే ఈ విచారణ కదా. మరి విద్యార్థి చెప్పిన బాధను ఎందుకు పట్టించుకోలేదు.? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇదే కాక, గతంలో నాడు-నేడు పనుల్లో సెక్యూరిటీ గార్డ్ తిమ్మప్ప ప్రిన్సిపాల్ పేరుతో ఫోర్జరీ సంతకాలు చేసి దాదాపు మూడు లక్షలు విత్‌డ్రా చేశాడనే ఆరోపణలు కూడా స్థానికులు చెబుతున్నారు. ఇంత తీవ్రమైన ఆరోపణల ఈ పాఠశాలపై ఉన్న, ఉన్నతాధికారులు ఇప్పటికీ ఏ చర్యలూ తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రస్తుతం పనిచేస్తున్న ఆర్ట్ టీచర్ అక్షయ్య, సెక్యూరిటీ గా ఉన్న వ్యక్తిని తన వ్యక్తిగత కారు డ్రైవర్‌గా వాడుతున్నాడనే మరో ఆరోపణ కూడా వినిపిస్తోంది. అయినా ఈ అంశంపై కూడా అధికారులు స్పందించకపోవడంతో, ఈ అవకతవకలకు ఎవరు వత్తాసు పలుకుతున్నారు.? అనే చర్చ సాగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల వెంటనే సెక్యూరిటీ గార్డు తిమ్మప్పపై మరియు ఆర్ట్ టీచర్ అక్షయ్యపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే విద్యార్థుల భద్రత ప్రమాదంలో పడుతుందని హెచ్చరిస్తున్నాయి. ఇది ఇలాగ కొనసాగితే కచ్చితంగా మేము జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తామని వారు ఆవేదన వ్యక్తం చేశారు..



Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP. Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.